సాక్షి నిజామాబాద్

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024



ధాన్యం తరుగు తీస్తలేరు

జిల్లాలో వరి కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. తరుగు తీయకుండా కొనుగోలు చేస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
38.4 /25.8

వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఎండ తీవ్రత కాస్త తగ్గవచ్చు. జిల్లాలో అక్కడక్కడ జల్లులు కురవవచ్చు.

న్యూస్‌రీల్

లక్ష్మి కాలువకు నీటిని విడుదల చేయాలి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా వెంటనే నీటి విడుదల చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. లక్ష్మి కాలువకు యాసంగి సీజన్‌లో కేటాయించిన నీటి కోటా పూర్తి కాక ముందే నిలిపి వేయడం సరికాదన్నారు. మరో రెండు తడుల నీరు అవసరం ఉందని, నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ప్రాజెక్ట్ నుంచి 0.3 టీఎంసీల నీటిని వెంటనే విడుదల చేసి పంటలను కాపాడాలన్నారు. లేదంటే బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, ముప్కాల్ ఎంపీటీసీ నాయకుడు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం'



బాల్కొండ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని టీఎస్ఎండీసీ చైర్మన్, ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ అన్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో తన నివాసంలో భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల లింబాద్రి, పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి అందరూ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఐక్యంగా పని చేసి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కిసాన్‌నగర్ గ్రామానికి చెందిన పద్మశాలి సంఘ సభ్యులు ఈరవత్రి అనిల్‌ను మార్కండేయ మందిరంలో ఘనంగా సన్మానించారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంబురంగా ఉగాది



నగరంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న టీఎన్జీవోస్ నాయకులు, ప్రజలు

జిల్లాలో మంగళవారం ఉగాది పర్వదినాన్ని సంబురంగా జరుపుకున్నారు. ప్రజలు శ్రీ క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడి సేవించారు. సాయంత్రం ఆలయాలకు వెళ్లి పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉగాది పర్వదినం సందర్భంగా ఎడ్లబండ్ల ప్రదర్శనలు, రథోత్సవాలు నిర్వహించారు.



మోపాల్ మండలం సిర్‌పూర్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆధిక్యతే లక్ష్యం..

నిజామాబాద్ పార్లమెంట్ స్థానంలో పాగా వేయడానికి కాంగ్రెస్ వ్యూహాత్మక ప్రణాళికలతో ముందుకెళ్తోంది. శాసనసభ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ఆధారంగా లోక్‌సభ ఎన్నికల్లో ఏ వర్గం, ఏ కులం ఓట్లు ఎటువైపు వెళతాయో ఆ పార్టీ నేతలు ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నారు. ఆయా సామాజిక వర్గాల ఓట్లను తమ వైపు తిప్పుకునేందుకు క్షేత్రస్థాయిలో కార్యాచరణను అమలు చేస్తున్నారు.



- నిజామాబాద్ పార్లమెంట్ స్థానం దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్న కాంగ్రెస్
- నియోజకవర్గాల వారీగా లెక్కలు వేస్తున్న నేతలు
- సామాజిక వర్గాల ఓట్లు రాబట్టుకునేందుకు ప్రణాళికలు
- జీవన్ రెడ్డి టార్గెట్ ఆరున్నర లక్షల పైచిలుకు ఓట్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ లోక్‌సభ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈ స్థానాన్ని చేజిక్కించుకునేందుకు పకడ్బందీ ప్రణాళికలతో ముందుకు వెళుతోంది. ఈ మేరకు ఆ పార్టీ అభ్యర్థి అయిన సీనియర్ నేత, మాజీ మంత్రి, పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ప్రతి చిన్న అవకాశాన్ని వదలకుండా సద్వినియోగం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ఎన్నికల్లో ఆధిక్యత సాధించేందుకు శాసనసభ నియోజకవర్గాల వారీగా సామాజిక వర్గాల ఓట్ల లెక్కలను చూసుకుని ముందుకు సాగుతున్నారు. కూడికలు, తీసివేతలు తదితర సమీకరణాలను చూసుకుని అడుగులు వేస్తున్నారు. ఐదు నెలల కిందట జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల ఆధారంగా.. లోక్‌సభ ఎన్నికల్లో ఏ వర్గం, కులం ఓట్లు ఎటువైపు వెళతాయో ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తూ అందుకు అనుగుణంగా ప్రణాళికలు వేసుకుంటున్నారు.

■ నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో గత శాసనసభ ఎన్నికల్లో ఏడు సెగ్మెంట్లలో కలిపి మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు 11,90,824 ఓట్లు వచ్చాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మొత్తం 4,08,135 ఓట్లు వచ్చాయి. బోధన్, నిజామాబాద్ రూరల్ స్థానాల్లో గెలుపొందారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు మొత్తం 4,17,315 ఓట్లు వచ్చాయి. బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల స్థానాల్లో గెలుపొందారు. బీజేపీ అభ్యర్థులకు 3,65,374 ఓట్లు వచ్చాయి. ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ స్థానాల్లో గెలుపొందారు. రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్‌కు ఈ పార్లమెంట్ పరిధిలో రెండు సీట్లు మాత్రమే దక్కినప్పటికీ ఓట్లు మాత్రం గణనీయంగా వచ్చాయి. అధికారం దక్కిన జోష్‌తో ఉన్న పార్టీ శ్రేణులు ఉత్సాహంతో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆయా సెగ్మెంట్ల వారీగా పక్కా ప్రణాళికతో అనుకున్న మేర ఆధిక్యం దక్కించుకునేందుకు ఇప్పటికే కసరత్తు చేశారు.

■ నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్‌లో డాక్టర్ భూపతిరెడ్డి 22 వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. భూపతిరెడ్డికి మొత్తం 78,378 ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఇంతకు మించి ఓట్లు సాధించే లక్ష్యంతో ఎమ్మెల్యే భూపతిరెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారు. పార్టీ శ్రేణులను గట్టిగా శ్రమించేలా నిరంతరం మోటివేట్ చేస్తున్నారు.

■ బోధన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి 3 వేల ఓట్లతో గెలిచారు. మొత్తం 66,963 ఓట్లు వచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా ఓట్లు సాధించే లక్ష్యంతో సుదర్శన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు.

■ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్‌అలీకి 59,853 ఓట్లు వచ్చాయి. ఇక్క డ బీజేపీ గెలిచింది. ఇక్కడ ఆధిక్యం సాధించేందుకు ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, షబ్బీర్‌అలీ కృషి చేస్తున్నారు.

■ ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డికి కేవలం 42,989 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీ గెలిచింది. బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి 65,884 ఓట్లు సాధించారు. కేవలం 4 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. బీఆర్ఎస్ గెలిచింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల ఆధిక్యం సాధించేందుకు గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు.

■ కోరుట్లలో కాంగ్రెస్ అభ్యర్థి నర్సింగ్‌రావుకు కేవలం 39,647 ఓట్లు వచ్చాయి. ఇక్కడా బీఆర్ఎస్ గెలిచింది. జగిత్యాలలో జీవన్‌రెడ్డికి 54,421 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీఆర్ఎస్ గెలిచింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో పాటు జగిత్యాల, కోరుట్ల సెగ్మెంట్లలో తనకున్న పట్టు కలిసొస్తుందని జీవన్‌రెడ్డి లెక్కలు వేసుకుంటున్నారు. ఇక నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ సెగ్మెంట్ల పరిధిలో పార్లమెంట్ ఇన్‌చార్జి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి నాయకులను సమన్వయం చేసుకుంటూ ప్రచార పర్వాన్ని పర్యవేక్షిస్తున్నారు.

టీఆర్‌టీ.. తీవ్ర పోటీ

- వందల్లో పోస్టులు.. వేలల్లో అభ్యర్థులు!
- 2017 నుంచి భర్తీ కాని ఖాళీలు



జిల్లా గ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

నిజామాబాద్‌అర్బన్: టీచర్ కొలువు సాధించడం ఈ సారి అంత సులువు కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయగా ఈ సారి తీవ్రమైన పోటీ నెలకొంది. జిల్లాకు 601 పోస్టులు మంజూరవగా.. ఇప్పటికే వేల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. మరోసారి టెట్ నిర్వహించనుండడంతో ఉత్తీర్ణులైన మరింత మంది అప్లై చేసుకోనున్నారు. సుమారు 35వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని అంచనా. పరీక్ష కోసం అభ్యర్థులు ఇప్పటికే గ్రంథాలయాలు, కోచింగ్ సెంటర్లలో పరీక్ష కోసం ప్రిపేర్ అవుతున్నారు. జూలైలో పరీక్ష జరగనుండడంతో సన్నద్ధమవుతున్నారు. మరోవైపు టెట్ కోసం కూడా చాలా అభ్యర్థులు ప్రిపేర్ అవుతున్నారు. గతంలో 2017లో టీఆర్‌టీ నిర్వహించగా.. ఇప్పటి వరకు ప్రభుత్వం మళ్లీ పోస్టుల భర్తీ చేపట్టలేదు. దీంతో వేలమంది అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణత సాధించి టీఆర్‌టీ కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ఎట్టకేలకు టీచర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు టీచర్ రిక్రూట్మెంట్ టెస్ట్ షెడ్యూల్‌ను సెప్టెంబర్‌లో విడుదల చేసింది. పరీక్ష తేదీ కూడా ప్రకటించినా.. ఎన్నికల షెడ్యూల్ రావడంతో వాయిదా పడింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా.. పోస్టుల సంఖ్య పెంచి మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఫిబ్రవరి 29న నోటిఫికేషన్ విడుదల కాగా.. మార్చి 4 నుంచి జూన్ 20వ తేదీరకు దరఖాస్తుకు అవకాశం కల్పించారు. జూలై 17 నుంచి 31 తేదీల వరకు పరీక్షలు జరుగనున్నాయి.

309 నుంచి 601 పోస్టులకు పెంపు

జిల్లాలో గత ప్రభుత్వం 309 పోస్టులు ప్రకటించి డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం ఈ సంఖ్యను పెంచి 601 పోస్టులు మంజూరు చేసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు–135, ఎస్జీటీ పోస్టులు–434, లాంగ్వేజ్ పండిట్‌లు–23, పీఈటీలు –9, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో తొలిసారిగా స్పెషల్ ఎడ్యుకేషన్‌పోస్టులు–43 ఉన్నాయి. మొత్తం 601 పోస్టులున్నాయి.

ఐదేళ్లుగా ఎదురుచూపులు

గత ప్రభుత్వం 2017లో డీఎస్సీ నిర్వహించగా తర్వాత మళ్లీ పోస్టుల భర్తీ చేపట్టలేదు. ఈ గడువు లో వేల మంది టెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులయ్యారు. గత కొన్నేళ్లుగా టెట్ ఉత్తీర్ణులైన వారు డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో గతేడాది జూన్‌లో నిర్వహించిన టెట్‌లో ఉత్తీర్ణత అభ్యర్థులు పేపర్–1 లో 4,880 మంది, పేపర్–2లో 5,383 మంది ఉన్నారు. అలాగే గతేడాది సెప్టెంబర్‌లో మరో టెట్ నిర్వహించగా సుమారు 12వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో సుమారుగా మూడు వేలకు పైగా మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. గతంలో టెట్ పాసయిన వారు కూడా వేల సంఖ్యలో ఉన్నారు. దీనికి తోడు ప్రస్తుతం టెట్ పరీక్ష నిర్వహించనుండడంతో మరింత మంది పాసై దరఖాస్తు చేసుకోనున్నారు. ఇలా జిల్లాలోని 601 పోస్టులకు గాను సుమారు 35 వేల మంది వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సబ్జెక్టుల వారీగా ఖాళీలను పరిశీలిస్తే ఒక్కొక్క పోస్టుకు పోటీ తీవ్రత ఎక్కువగా ఉంది.

అభ్యర్థుల సంఖ్య భారీగా పెరగనుంది



డీఎస్సీ అభ్యర్థులు ఈ సారి భారీగా పెరగనున్నారు. 2017 నుంచి పోస్టుల భర్తీ చేపట్టలేదు. టెట్ రాసి ఉత్తీర్ణులైన వారు ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం కోచింగ్ కోసం అభ్యర్థులు గతంలో ఎన్నడూ లేని విధంగా వస్తున్నారు. దీంతో పోటీ తీవ్రంగా ఉంటుంది. – రవివర్మ, హైఫై కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు, నిజామాబాద్

వరికి వడగళ్ల దెబ్బ



సాలూర మండలం మందర్నలో రాలిన వరి గింజలను పరిశీలిస్తున్న ఏవో, రైతులు

- జిల్లాలో రెండు వేల ఎకరాల వరకు పంట నష్టం
- వాతావరణ మార్పులతో పెరిగిన పంట కోతలు

డొంకేశ్వర్(ఆర్మూర్): చేతికొచ్చిన వరి పంటను వడగళ్లు నేలపాలు చేశాయి. సోమవారం రాత్రి వర్ని, కోటగిరి, పొతంగల్, బోధన్, మోస్రా, చందూర్ మండలాల్లో వడగళ్లు కురిశాయి. 2 వేల ఎకరాల వరకు వరికి నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశా రు. కోతకు వచ్చిన వడ్లు పొలాల్లోనే నేలరాలడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. ఏఈవోల ద్వారా పంట నష్టం వివరాలు సేకరించి బుధవారం వెల్లడిస్తామని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. మంగళవారం కూడా జిల్లాలో అక్కడక్కడా ఉరుములు మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. రోడ్లపై, కల్లాల్లో ఆరబోసిన వడ్లు తడవకుండా కాపాడుకునేందుకు టార్పాలిన్లు కప్పుతూ కష్టాలు పడ్డారు.

వర్షాలు కురుస్తుండడంతో..

వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని అకాల వర్షాలు, వడగళ్లు కురుస్తుండడంతో రైతులు వరి కోతలను వేగవంతం చేశారు. చేతికొచ్చిన పంట నేలపాలు కాకుండా పచ్చిమీద కోతలు కోసి కుప్పలు పోసి పెడుతున్నారు. యాసంగిలో జిల్లా వ్యాప్తంగా 4.13 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. దాదాపు గంగాకావేరి రకం సన్నాలు కోతలు పూర్తయ్యాయి. ఇంకా 50 శాతం పంట కోత దశలో ఉంది. కోత యంత్రాలకు డిమాండ్ పెరింగింది. రేటు ఎక్కువైనా సరే పంటను కోపిస్తున్నారు.



నేలరాలిన మామిడికాయలను చూపిస్తున్న రైతు

వేసవిలో నిప్పు.. ముప్పు

■ నగరంలోని దేవిరోడ్డులోని బాలాజీ సానిటరీ షాపులో ఇటీవల షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. షాపులో రూ. 30 లక్షల మేర ఆస్తినష్టం జరిగింది. ఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు.

■ నెల రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో గల స్టెప్ చెప్పల దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో రూ. 10 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.

■ సుమారు 20 రోజుల క్రితం నిజామాబాద్ రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్‌రైలులోని వ్యాగన్‌లో పొగలు రావడంతో రైల్వే అధికారులు ఫైర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఫైర్ సిబ్బంది వెంటనే వచ్చి ఆర్పివేశారు.

- ఏటా పెరుగుతున్న అగ్ని ప్రమాదాలు
- ఈ ఏడాది ఆస్తినష్టం రూ. 45 లక్షలు



నగరంలోని ఇంద్రనగర్‌లో గల ట్రాన్స్‌ఫార్మర్ సెంటర్ వద్ద మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది (ఫైల్)

ఖలీల్‌వాడి: జిల్లాలో అగ్ని ప్రమాదాలు ప్రతియేటా పెరుగుతూనే ఉన్నాయి. ఈ యేడు ఏప్రిల్ మొదటి వారంలోనే ఎండలు 42 డ్రిగీలకు చేరుకున్నాయి. ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతుండడంతో ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ అగ్ని ప్రమాదాలకు దారి తీస్తుంది. ప్రధానంగా గ్రామాల్లో ఎక్కువగా జరిగే అవకాశముంది. వ్యవసాయ పనులు ముగిసిన అనంతరం పంట చేన్లలో నిప్పు పెట్టడం వల్ల గాలికి నిప్పు రవ్వలు ఎగిరి సమీపంలో ఉన్న గడ్డివాములు, ఇళ్లపై పడితే మంటలు చెలరేగే ప్రమాదం ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశముంది. షాపింగ్ మాళ్లు, ఆస్పత్రులు, ఇతర వ్యాపార సముదాయాలతో పాటు నివాసాల్లో ఏసీలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకరణాలు షార్ట్ సర్క్యూట్ అయ్యే అవకాశాలుంటాయి. అగ్ని ప్రమాదం ఎలా జరిగినా ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లుతుంది. అందుకే వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారులు సూచిస్తున్నారు.

ఫైర్ సిబ్బంది కొరత

ప్రమాదాణాలను నివారించడానికి ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు. కానీ సిబ్బంది కొరత కారణంగా ఒక్కో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలోని ఏడు ఫైర్ స్టేషన్లలో కలిపి 128 ఫైర్ ఆఫీసర్లు, లీడింగ్ ఫైర్‌మన్లు, డ్రైవర్ ఆపరేటర్లు, ఫైర్‌మన్లు ఉండాలి ఉండగా.. 53 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ప్రమాదాలు సంభవించిన సమయంలో ఫైర్ సిబ్బందికి సమస్యలు తప్పడంలేదు. అలాగే అగ్నిమాపక కేంద్రాలలో అదనపు వాహనాలు అవసరం కూడా ఉంది. ఇటీవల జిల్లాలో నందిపేట్, బాల్కొండ ఫైర్ స్టేషన్లను కొత్తగా ఏర్పాటు చేశారు.

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తి నష్టం	కాపాడిన ఆస్తి విలువ
2022	135	రూ.61.20 లక్షలు	రూ. 2.73 కోట్లు
2023	190	రూ.29.70 లక్షలు	రూ.1.37 కోట్లు
2024 మార్చి నాటికి	104	రూ.45 లక్షలు	రూ.99 లక్షలు

ఫైర్ స్టేషన్	ఫోన్ నెంబర్
నిజామాబాద్	87126 99225
ఆర్మూర్	87126 99229
భీమ్‌గల్	87126 99223
బాల్కొండ	87126 85797
నందిపేట్	87126 85799
ఇందల్వాయి	87126 99231
బోధన్	87126 99227

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

- జిల్లాలో అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, దుకాణా సముదాయాల్లో అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదాలు జరగకుండా ఫైర్ సిబ్బంది ఇచ్చిన సూచనలు తప్పక పాటించాల్సిన అవసరం ఉంది.
- అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే అగ్నిమాపక వాహనాలు తిరిగే ఏర్పాట్లు ఉండాలి. ప్రతి ఫ్లాట్‌లకు నీరందేలా పైపులైన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- షాపుల్లో మండే స్వభావం ఉన్న వస్తువులను పెట్టకూడదు.
- ఇంట్లో ఉండే సిలిండర్లకు వేడి తగలకుండా జాగ్రత్తలు పాటించాలి.
- ఎలుకలు విద్యుత్ తీగలను కొరుకుతాయి. అందుకే వీటి నివారణకు చర్యలు చేపట్టాలి. విద్యుత్ వైర్లను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలి.
- ఇళ్లలో, దుకాణాల్లో వెంటిలేషన్ సరిగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి

అగ్నిప్రమాదాలపై ఫైర్ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు జరిగేటప్పుడు ఎలా వ్యవహరించాలని మహిళ ప్రయోగాత్మకంగా వివరిస్తున్నాం. ఇండ్రస్టీస్‌లలో యాజమాన్యాలు, పెద్ద హోటళ్లు, ఆస్పత్రుల నిర్వాహకులకు, వాటిలో పనిచేసే సిబ్బందికి పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నాం. – నర్సింగ్‌రావు, ఫైర్ ఆఫీసర్, నిజామాబాద్

క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిన కవితారెడ్డి



ఖలీల్‌వాడి: జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యురాలు కవితారెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో కవితారెడ్డి కాంగ్రెస్‌లో చేరగా, హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆమెకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైద్యురాలిగా, సామాజిక సేవకురాలిగా గుర్తింపు పొందిన కవితారెడ్డి నిజామాబాద్ ఎంపీ టికెట్‌ను ఆశించారు. అధిష్టానం జీవన్‌రెడ్డికి టికెట్ ఖరారు చేసిన నేపథ్యంలో, భవిష్యత్‌లో చట్ట సభలకు పోటీ చేసే అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ఆమెకు హామీ ఇచ్చినట్లు సమాచారం. రాజకీయ నేపథ్యమున్న కవితారెడ్డి చేరికతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరుతుందని నాయకులు భావిస్తున్నారు.

తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ప్రవీణ్



నిజామాబాద్ నాగారం/పెర్కిట్(ఆర్మూర్): తైక్వాండో అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఆర్మూర్ పట్టణానికి చెందిన తైక్వాండో మాస్టర్ సాంబడి ప్రవీణ్ ఎన్నికయ్యారు. అలాగే జనరల్ సెక్రెటరీగా మాస్టర్ వినోద్‌నాయక్, ట్రెజరర్‌గా బానోత్ వినోద్ ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్(నాచారం)లో సోమవారం తైక్వాండో అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మాల్క కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహీద్ అలీ ఖాన్, కోశాధికారి మారుతికి ధన్యవాదాలు తెలిపారు. తైక్వాండో అసోసియేషన్‌కు ఎన్నికైన మాస్టర్లకు క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు శుభాకంక్షలు తెలిపారు.

కేసు నమోదు

ఖలీల్‌వాడి: నకిలీ పత్రాలు సృష్టించి స్థలం లేకుండా స్థలం ఉన్నట్లు నమ్మించి విక్రయించిన వారిపై కేసు నమోదు చేసినట్లు నాల్గోటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై సంజీవ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని పద్మనగర్‌కు చెందిన అంకం సత్యనారాయణ నాందేవ్‌వాడకు చెందిన వారి నుంచి గాయత్రినగర్‌లోని సర్వే నంబర్ 824లో 100 గజాల స్థలాన్ని రూ.18లక్షలకు కొనుగోలు చేశాడు. తాను కొనుగోలు చేసిన స్థలం లేదని గ్రహించిన సత్యానారాయణ పోలీసులు ఆశ్రయించగా, బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోతదశలో నేలమట్టం



శ్యామ్‌రావు తండాలో నేలకొరిగిన మొక్కజొన్న



చందూర్ మండలం కారేగాం శివారులో నేలరాలిన వడ్లు

అన్నదాతలకు వడగండ్ల వాన అపారనష్టాన్ని మిగిల్చింది. కష్టించి పండించిన పంట కోత దశలో చేజారిపోయింది. యాసంగి సీజన్ పంటపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు అకాలవర్షం దెబ్బతో విలవిలలాడుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వందలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలతోపాటు మామిడి దెబ్బతిన్నాయి. రెండుమూడు రోజుల్లో పంట కోతలు ప్రారంభించే సమయంలో పెద్దపెద్ద వడగళ్లు పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 15 నిమిషాల వ్యవధిలో కళ్ల ముందే పంట నేలరాలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, మామిడి
- రైతులను నిండాముంచిన వడగళ్లు!
- వర్ని, చందూర్, రుద్రూర్, సాలూర మండలాల్లో నష్టం

వర్ని(చందూర్)/రుద్రూర్/బోధన్: అకాల వర్షానికి వర్ని, చందూర్ మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి వర్ని మండలంలో 623 ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి నగేశ్‌రెడ్డి తెలిపారు. వర్ని మండలం జలాల్‌పూర్, సైదిపూర్, పైడిమల్, సిద్దాపూర్, రాజిపేట్, శంకోరా గ్రామాల పరిధిలో 105 ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు ఆయన వెల్లడించారు. చందూరు మండలం ఘన్‌పూర్, లక్ష్మాపూర్, మేడిపల్లి, కారేగాం, చందూర్ శివార్లలో 428 ఎకరాలు, మోస్రా మండలంలోని తిమ్మాపూర్, చింతకుంట, గోవూర్ గ్రామాల పరిధిలో 90 ఎకరాల్లో వరికి నష్టం జరిగిందన్నారు. దెబ్బతిన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు. పొతంగల్ మండలం సోంపూర్, టాక్లీ, రాంగంగానగర్, దొమలెడ్గి, కోటగిరి మండలం వల్లభాపూర్ గ్రామాల్లో కోతకు వచ్చిన ధాన్యం నేలరాలింది. నూర్పిడి పూర్తయి విక్రయించేందుకు సిద్ధం చేసిన ధాన్యం తడిసిముద్దయ్యింది. మండల వ్యవసాయధికారి శ్రీనివాస్‌రావు దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలను సేకరించారు. సుమారు 500 ఎకరాల్లో వరి దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు.

పరిశీలన..

చేతికొచ్చిన పంట నేలపాలుకావడం బాధాకరమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. పొతంగల్ మండలం సోంపూర్, టాక్లీ, దొమలెడ్గి శివార్లలో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. వ్యవసాయాధికారులు పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందజేసి రైతులకు త్వరగా పరిహారం అందేలా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ శంకర్ పటేల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, చాకరి గంగాధర్, నాయకులు మాధవరావ్, దిగంబర్ పటేల్, నాగరాజు గౌడ్, రాంబాబు తదితరులున్నారు. సోంపూర్, టాక్లీ, రాంగంగానగర్, దొమలెడ్గి శివార్లలో దెబ్బతిన్న పంటలను బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని రైతులకు భరోసా కల్పించారు. ఎకరానికి రూ.10వేల నష్టపరిహారం ఇప్పిస్తామన్నారు. త్వరలోనే సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. గత ప్రభుత్వం పంటబీమా అమలు చేయకపోవడంతో రైతులు నష్టాన్ని చవి చూడాల్సి వస్తోందన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు పుప్పాల శంకర్, గంధపు పవన్‌కుమార్, ఎంపీటీసీ అనంత విఠల్, కొత్తపల్లి విండో చైర్మన్ సునీల్‌కుమార్ చౌదరి, నాగనాథ్ పటేల్, హన్మంతు తదితరులున్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా పరిషత్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్, చందూర్ జెడ్పీటీసీ అంబర్‌సింగ్ రైతులకు భరోసా కల్పించారు. చందూర్ మండలం లక్ష్మీసాగర్ తండా, మేడిపల్లి శివార్లలో దెబ్బతిన్న వరిని ఆయన పరిశీలించారు. చందూర్ మండల కేంద్రంలో దెబ్బతిన్న పంటలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం చెల్లించాలని, రాష్ట్రంలో ఫసల్ బీమాను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బోధన్ మండలం పెంటాకుర్దు, పెంటాకుర్దుక్యాంప్, సాలంపాడ్ గ్రామశివార్లలో దెబ్బతిన్న పంటలను స్థానిక రైతులు, ఏఈవో చరణ్‌తో కలిసి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సాయిపటేల్ డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలు సరైన సమయంలో ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ఆయన వెంట పెంటాకుర్దు క్యాంప్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, నాయకులు కొత్తపల్లి నాగయ్య, శ్రీనివాస్ రెడ్డి, రవిగౌడ్, నడ్పి మక్కయ్య, రైతులు రాజు, చినుగొండ, సాయిలు తదితరులున్నారు.



కోకల్‌దాస్ తండా వద్ద ధ్వంసమైన రేకుల ఇల్లు



మహిళారైతును ఓదారుస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి

వరి, మామిడికి అపార నష్టం





సాలూర మండలం మందర్న శివారులో నేలవాలిన వరి, రాలిన మామిడికాయలు

బోధన్ : మంజీర నదీతీరంలోని సాలూర మండలం మందర్న, హున్సా, ఖాజాపూర్ గ్రామాల శివార్లలో భారీ ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురిసింది. మందర్న గ్రామ శివారులో 550 ఎకరాల్లో వరిసాగు చేయగా, 40 శాతం కోతలు పూర్తికాగా, మరో 60 శాతం పంట కోతను రెండు మూడు రోజుల్లో ప్రారంభించనున్న తరుణంలో వడగండ్లు పడ్డాయి.

కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మందర్న ,హున్సా గ్రామాల శివార్లలో 80 నుంచి 100 ఎకరాల వరకు మామిడి తోటలున్నాయి. ఈదురుగాలులు, వడగండ్ల కారణంగా మామిడి కాయలు రాలిపోయాయి. మామిడి పూత విరగబూసినప్పటికీ వాతావరణ మార్పుల కారణంగా 75శాతానికి పైగా రాలిపోయింది. ఎంతోకొంత మిగిలిన కాత ప్రస్తుత అకాల వర్షానికి దెబ్బతిన్నది.

ఏఈవో సుజాత, హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి రైతులతో కలిసి దెబ్బతిన్న వరి, మామిడి తోటలను సందర్శించి నష్టాన్ని పరిశీలించారు.

అగ్గిపెట్టేస్తా

నాకు సొంతంగా ఒక ఎకరం ఉండగా, మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎకరానికి రూ.27 వేలు చెల్లించే ఒప్పందంతో కౌలుకు తీసుకున్నాను. కౌలుతో కలుపుకుని రూ.2 లక్షలకు పైగా పంట సాగుకు ఖర్చు చేశాను. అమావాస్య, ఉగాది కారణంగా బుధవారం నుంచి పంట కోత ప్రారంభిద్దామనుకున్నా. ఇంతలో వడగండ్ల వర్షం కురిసి పంట పూర్తిగా నేలపాలయ్యింది. ఇప్పుడు పంట కోసేందుకు పెట్టే ఖర్చు చేతికొచ్చే పరిస్థితి లేదు. పంటను కోసే కంటే అగ్గిపెట్టేస్తా. అకాల వర్షం కురిసిన రాత్రి కంటి మీద కునుకు లేకుండా పోయింది. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– శివరాజ్, రైతు, మందర్న

ధాన్యం తరుగు తీస్తలేరు..

- గతంలో క్వింటాలుకు 8 కిలోల తరుగు
- ఈ సీజన్‌లో ఎలాంటి తరుగు తీయొద్దన్న ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

మోర్తాడ్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతుండగా ఎక్కడా తరుగు తీయకపోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 466 ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. యాసంగి సీజన్‌లోను సన్నరకాలను సాగు చేయడంతో వాటిని వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తక్కువగా వస్తోంది. ఈ సీజన్‌లో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. కానీ ఇప్పటికే దాదాపు 3లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైస్‌మిల్లర్లు నేరుగా కొనుగోలు చేయడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. గతంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయిస్తే ప్రతి క్వింటాలుకు 5 నుంచి 8 కిలోల తరుగు తీసేవారు. దీంతో రైతులకు పెద్ద మొత్తంలో నగదు తక్కువ జమ అయ్యేవి. అక్రమ తరుగు తీతపై రైతులు అనేకమార్లు ఆందోళన చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ అక్రమ తరుగు తీతపై నాటి నుంచి కాంగ్రెస్ సైతం ఆందోళన చేస్తూ వస్తోంది. ఈ సారి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కంట ఆనందం చూడాలని ఆకాంక్షించింది. దీంతో ధాన్యం కొనుగోళ్లలో తరుగుతీత చేపట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించడంతో అధికారులు, సహకార సంఘాల ఉద్యోగులు ఆ ఆదేశాలను పాటిస్తున్నారు. పౌర సరఫరాల శాఖ అధికారులు సైతం ధాన్యం సేకరణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తుండటంతో రైస్‌మిల్లర్లు సహకరిస్తున్నారని తెలుస్తోంది. మిల్లర్ల నుంచి ముడుపులు అడిగే వారు లేకపోవడంతో మిల్లర్ల యజమానులు కూడా ధాన్యం తరుగు తీతపై ఎలాంటి పట్టింపులు లేకుండానే వ్యవహరిస్తున్నారు. ప్రతి సీజన్‌లో ధాన్యం తరుగు తీత వల్ల రైతులు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు నష్టపోయేవారు. ఈ ఏడాది తరుగు తీయకుండా 41.50 కిలోల సంచికి అంతే ధాన్యాన్ని లెక్కగట్టి ట్రక్ షీట్‌లను రైస్‌మిల్లర్లు జారీ చేస్తుండటం విశేషం.



తొర్తిలో ధాన్యం తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉంచిన సంచులు

గత ప్రభుత్వ హయాంలోనే తరుగు



గత ప్రభుత్వ హయాంలోనే ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీశారు. అనేక మంది రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నష్టపోయారు. ఈసారి తరుగు తీయకపోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– బూత్‌పురం మహిపాల్, రైతు, మోర్తాడ్

కాంగ్రెస్ మాట నిలబెట్టుకుంది



రైతులకు ఇచ్చిన హామీలలో ఒకటి ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీయకపోవడం, ఈ హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంది. ధాన్యం తరుగు తీయకపోవడంతో రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది.

– గురిజాల నర్సయ్య, రైతు, శెట్‌పల్లి

అధికారి నిర్లక్ష్యం.. బాధిత కుటుంబానికి నష్టం



బాన్సువాడ: అధికారి చేసిన నిర్లక్ష్యంతో ఓ చిరుద్యోగి కుటుంబానికి తీరని నష్టం వాటిల్లింది. బీర్కూర్ సహకార సంఘంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న అదే గ్రామానికి చెందిన అంబయ్య(32) మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడు అంబయ్య పదేళ్లుగా బీర్కూర్ సొసైటీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సొసైటీలో పని చేసే ఉద్యోగులందరికి పీఎఫ్ చెల్లిస్తున్నారు. కానీ అంబయ్య పేరిట మాత్రం పీఎఫ్ చెల్లించడంలో సొసైటీ కార్యదర్శి నిర్లక్ష్యం ప్రదర్శించాడు. గతంలో సొసైటీ డైరెక్టర్లు సొసైటీలో పని చేసే ప్రతి ఒక్కరికి పీఎఫ్ ఉండాలని తీర్మాణం చేశారు. కానీ కార్యదర్శి అంబయ్య పేరుపై పీఎఫ్ చెల్లించకపోవడంతో మృతుడికి రావాల్సిన ఆర్థికసాయం అందకుండా పోయింది. పీఎఫ్ చెల్లించి ఉంటే అంబయ్య కుటుంబానికి ఆసరా అయ్యేది. అధికారి నిర్లక్ష్యంతోనే అంబయ్య కుటుంబానికి తీరని నష్టం వాటిల్లిందని ఇటీవల సొసైటీలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో డైరెక్టర్లు సదరు అధికారిని నిలదీశారు. అంబయ్య భార్యకు ఇప్పటి వరకు ఉద్యోగం కూడా ఇవ్వలేదు. ఈ విషయమై సొసైటీ కార్యదర్శి విఠల్‌ను వివరణ కోరగా సొసైటీలో పని చేసే ఉద్యోగులకు పీఎఫ్ చెల్లిస్తున్నాం. అంబయ్య పేరుతో పీఎఫ్ చెల్లిస్తామంటే సొసైటీ చైర్మన్ అంగీకరించలేదని అన్నారు. మృతుతు అంబయ్య భార్యకు త్వరలో సొసైటీలో ఉద్యోగం ఇస్తామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లె గ్రామ శివారులో మంగళవారం సాయంత్రం బైక్ అదుపుతప్పి ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై మనోజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లోలం గ్రామానికి చెందిన కర్నూరం గంగారాం, ఎనుగంటి సాయిలు ఇందల్వాయిలో పని ముగించుకొని స్వగ్రామానికి వెళ్తుండగా ఎలారెడ్డిపల్లి శివారులో బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో గంగారాం(50) తలకు తీవ్రగాయాలై ఘటనాస్థలంలోనే మృతి చెందగా, సాయిలుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి మహిళ..

డిచ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని బీబీపూర్ గ్రామపంచాయతీ అవుసుల తండాకు చెందిన ఎం.రాధాబాయి (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై యూ.మహేశ్ మంగళవారం తెలిపారు. రాధాబాయి సోమవారం రాత్రి డిచ్‌పల్లి కమాన్ వద్ద 44వ నెంబర్ జాతీయ రహదారిని దాటుతుండగా వేగంగా బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తల, చేతులు, కాళ్లకు తీవ్రగాయాలు కాగా హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ వైర్లు చోరీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కృష్ణాజివాడి శివారులోని వ్యవసాయబావుల వద్ద విద్యుత్ వైర్లను గుర్తు తెలియన వ్యక్తులు దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 8మంది రైతులకు సంబంధించిన బోరుమోటారు కేబుళ్లు, మోటారు కరెంటు వైర్లను దొంగలించారన్నారు. గ్రామానికి చెందిన సుందర్‌రెడ్డి, బద్దం అనూష్‌రెడ్డి, బద్దం లక్ష్మారెడ్డి, బద్దం సంగారెడ్డి, బద్దం లలిత, బద్దం రాఘవరెడ్డి, బద్దం దత్తారెడ్డి, బద్దం జనార్దన్‌రెడ్డికి చెందిన వైర్లను ఎత్తుకెళ్లారన్నారు. పోలీసులు నిఘాసారించి చోరీలను నివారించాలని రైతులు కోరుతున్నారు.

చికిత్స కోసం వస్తే బంగారం చోరీ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగి నుంచి బంగారం చోరీ అయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని సూర్యనగర్‌కు చెందిన ఓ మహిళ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబీకులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆదివారం తరలించారు. సిబ్బంది చికిత్స నిమిత్తం ఐసీయూకు మహిళను తీసుకెళ్లగా చికిత్స చేస్తున్న సమయంలో మూడు తులాల బంగారం చోరీకి గురైంది. ఈ విషయమై బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. సదరు ఆస్పత్రి యాజమాన్యం ఐసీయూలోని సీసీటీవీ ఫుటేజీలను ఒకటో టౌన్ పోలీసులకు అందజేసినట్లు సమాచారం. సోమవారం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఓ నర్సును అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబును వివరణ కోరగా బాధితులు వచ్చారని, ఎవరిని అదుపులోకి తీసుకోలేదని తెలిపారు.

కోర్టులో కేసు లేకుండా చేస్తామని మోసం

- డమ్మీ క్లియరెన్స్ సృష్టించిన వ్యక్తులు
- బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

బోధన్‌రూరల్(బోధన్): కోర్టు రికార్డుల్లో ఉన్న కేసును తొలగింపజేస్తామని నమ్మించి ఒకరిని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోధన్ మండలం సంగం గ్రామానికి చెందిన వెంకటేశ్‌పై 2010లో యాక్సిడెంట్ నమోదైంది. ఆ కేసు ప్రస్తుతం అక్విటల్ (సాక్ష్యాలు చెప్పకపోవడం) అయినట్లు జ్యుడీషయల్, పోలీస్ ఆన్‌లైన్ రికార్డుల్లో ఉంది. ఇదిలా ఉండగా, వెంకటేశ్ బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా చేరేందుకు వెంకటేశ్ వెళ్లాడు. సదరు కంపెనీ ప్రతినిధులు క్లియరెన్స్ సర్టిఫికెట్(క్యారెక్టర్ సర్టిఫికెట్) తీసుకురావాలని సూచించారు. దీంతో తనపై ఉన్న కేసు గురించి వర్ని మండలంలోని కోటయ్యక్యాంప్ గ్రామానికి చెందిన ప్రహర్షకు వెంకటేశ్ తెలిపాడు. బోధన్‌కు చెందిన శ్యామిల్ అనే వ్యక్తితో కలిసి కేసు వివరాలను కోర్టు ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగింపజేస్తామని వెంకటేశ్ నుంచి వారు రూ.15వేలు తీసుకుని డమ్మీ క్లియరెన్స్ ఇచ్చారు. ఆ తరువాత వెంకటేశ్ క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకొని బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పాత కేసు అలాగే ఉన్నట్లు రికార్డుల్లో వచ్చింది. పాత కేసు వివరాలను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించడం సాధ్యం కాదని పోలీసులు వెంకటేశ్‌కు తెలిపారు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన వెంకటేశ్.. ప్రహర్ష, శ్యామిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు.

ఆటోను ఎత్తుకెళ్లిన దుండగులు

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన మహమ్మద్ పాషాకు చెందిన ఆటో (టీఎస్ 16 యూసీ 8855)ను దుండగులు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై యూ.మహేశ్ తెలిపారు.

రోజులాగే పాషా తన ఆటోను సోమవారం రాత్రి ఇంటి ముందు నిలిపి చేసి పడుకున్నాడు. మంగళవారం తెల్లవారు ఝామున 4 గంటలకు లేచి చూడగా ఇంటి ముందు ఆటో కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తన ఆటోను ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

మోపాల్: డ్రంకన్ డ్రైవ్‌లో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేయగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న మరో ఇద్దరిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా మద్యం సేవించి వాహనం నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

విచ్చలవిడిగా మద్యం సిట్టింగ్‌లు



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డిలో విచ్చలవిడిగా మద్యం సిట్టింగులు కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పెద్ద చెరువు తూము పరిసర ప్రాంతాల్లో మద్యం సేవించి సీసాలను అక్కడే వదిలేస్తున్నారని, మరికొందరు మద్యం మత్తులో సీసాలను పగులగొడుతున్నారని తెలిపారు. చేపల వేట, ఈతకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో మద్యం దుకాణం ప్రారంభమైన నాటి నుంచి బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా సిట్టింగ్‌లు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్: మండలంలోని కొప్పర్గ శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ పేర్కొన్నారు. కొప్పర్గ శివారులో ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం రాత్రి దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం ఇసుకను స్వాధీనం చేసుకొని ట్రాక్టర్ డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సాలూర, బోధన్ మండలాల్లో ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుమాతని పేర్కొన్నారు.

మొరం తరలిస్తున్న వాహనాలు..

నవీపేట: అనుమతులు లేకుండా అక్రమంగా మొరాన్ని తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. మండలంలోని ధర్మారం నుంచి అనంతగిరికి మొరాన్ని తరలిస్తున్న టిప్పర్‌ను, కమలాపూర్ నుంచి నవీపేటకు మొరాన్ని తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. సీజ్ చేసిన వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు.